
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0
తణుకు : 35.0 - 25.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 17 సెప్టెంబరు 2024



నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవ : కలెక్టర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 16 : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వచ్చే నెల 2న స్వచ్ఛ భారత్ దివాస్‌గా జరుపుకుంటామని చెప్పారు. ఈ నెల 17న ప్రారంభోత్సవం ఉంటుందని చెప్పారు. తల్లి పేరుతో మొక్క నాటడం, విద్యుత్, నీటిని ఆదా చేయడం, ప్లాస్టిక్ నిరోధం, తాగునీటి క్లోరినేషన్, ఆరోగ్యకరమైన జీవితం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమాలు మూడు రకాలుగా అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపాలిటీలలో, నియోజక వర్గం పరిధిలో జరుగుతాయని, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. వచ్చే నెల 2న స్వచ్ఛ భారత్ దివాస్ ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.

తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణేశుడి నవరాత్రులు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా సోమవారం ఊరూరా వేలాది గణనాథుల భారీ విగ్రహాలను నదులు, కాల్వల్లో నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు. మేళతాళాలు.. రకరకాల విచిత్ర వేషధారణలు, బాణసంచా పేలుళ్లతో ఊరేగింపులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



మహ్మద్ ప్రవక్త జన్మ దినోత్సవాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయన చూపిన మార్గం, బోధనలు సర్వ మానవాళికి ఆదర్శనీయమని మత గురువులు పేర్కొన్నారు. మసీదుల్లో (చిత్రం : గణపవరంలో) ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరికీ మిఠాయిలు పంచారు.



వైసీపీ నేతలు సమర్పించు..

ఒక రోడ్డు కథ

- చిన అమిరంలో వైసీపీ నేత అనధికార లే అవుట్ ఏర్పాటు
- ఆ పార్టీ అధికారంలో వుండగా రోడ్డు, డ్రెయిన్‌లకు రూ.60 లక్షల మంజూరు
- ఫలితాలు వచ్చిన తర్వాత నిర్మాణం.. మొదటి విడత బిల్లులు చెల్లింపు
- దీని నిర్మాణానికి గ్రామసభ అభ్యంతరం.. అయినా జడ్పీ నిధులు కేటాయింపు
- అప్పటి ప్రజా ప్రతినిధి చెప్పగానే.. జీ హుజూర్ అంటూ అధికారుల పనులు





ఇది చిన అమిరం గ్రామ పంచాయతీకి వెళ్లే రహదారి. అందరికి అవసరమైన దీనిని నిర్మించాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానికులు కోరారు. స్పందించలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.28 లక్షలతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకో లేదు. అదే అప్పుడు వైసీపీ నేత వెంచర్ కోసం మాత్రం ఆగ మేఘాలపై స్పందించారు.

భీమవరం పట్టణానికి ఆనుకుని వున్న చిన అమిరంలో అక్కడ ఎలాంటి నివాసాలు లేవు. ఆ ప్రాంతంలో ఓ రియల్టర్ అనధికార లే అవుట్ ఏర్పాటు చేశాడు. ఇక్కడకు వెళ్లేందుకు అధికారులు జిల్లా పరిషత్ నిధులు రూ.60 లక్షలతో రోడ్డు, డ్రెయిన్ నిర్మించి వైసీపీ నేతల సేవలో తరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైతే.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆగమేఘాల మీద రోడ్డు వేసి మొదటి విడత బిల్లులు కూడా చెల్లించేశారు. దీనిపై కూటమి నేతలు చేసిన ఫిర్యాదులను అధికారులు లెక్క చేయలేదు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

చిన అమిరం ప్రాంతంలో ఓ ప్రైవేటు పాఠశాల ఎదురుగా రూ.18 కోట్ల విలువైన మూడు ఎకరాల భూమిలో వెంచర్ వేశారు. చుట్టుపక్కల విలాసవంతమైన భవనాలు. అక్కడ ఎకరం రూ.ఆరు కోట్ల పైమాటే. వెంచర్ వేయడంలో వైసీపీ ప్రజా ప్రతినిధి కీలక భూమిక వహించారు. కానీ, లే అవుట్‌గా గుర్తింపు పొందలేదు. వెంచర్‌లో రహదారిని పంచాయతీకి గిఫ్ట్ డీడ్‌గా రాశారు. ఆ రహదారి తమదే అన్నట్టు పంచాయతీ భావించింది. వెంచర్ ఏదైనా రహదారులు పంచాయతీకి వర్తిస్తాయి. నిబంధనలకు అనుగుణంగా రహదారి ఉంటేనే భవన నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేస్తారు. కాని, సదరు వెంచర్‌లో నివాసాలు కట్టడం లేదు. కొందరు పెద్దలు ఇక్కడ స్థలాలు కొన్నారు. స్థలాల రూపంలో రూ.12 కోట్లకు అమ్ముడుపోయింది. అప్పటి వైసీపీ ప్రజా ప్రతినిధికి పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరినట్లు సమాచారం. పంచాయతీకి ఇచ్చిన గిఫ్ట్‌డీడ్ రహదారిలో సిమెంట్ రోడ్డు, ఇరువైపులా డ్రెయిన్‌లు నిర్మించారు. ఇందుకు జడ్పీ నిధులు కేటాయించారు.

వైసీపీ నేత సిఫారసు

వైసీపీ ప్రజా ప్రతినిధి వేసిన వెంచర్‌లో స్థలాలు మాత్రమే ఉన్నాయి. నివాసాలు లేవు. ఇక్కడ రహదారి వేయడానికి ఎన్నికల ముందు నియోజకవర్గ వైసీపీ నేత సిఫారసు చేశారు. అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ముందే టెండర్లు పిలిచి ఖరారు చేశారు. రహదారి పనులు చేస్తుండగానే గ్రామస్తులు వ్యతిరేకించారు. జడ్పీ నిధులతో రహదారి వేసే చర్యలను గ్రామసభలో తీర్మానం చేస్తూ తప్పుపట్టారు. పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ అధికారులకు కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. అయినా వారిలో చలనం లేదు. ఎన్నికల ఫలితాల అనంతరం రాత్రి, పగలు పనిచేసి రోడ్డు వేసేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి బిల్లును మంజూరుచేశారు. ఈ రహదారిపై అంజిబాబు ప్రశ్నిస్తే లేఅవుట్ అయిపోయినట్టు చెప్పుకొచ్చారు. లే అవుట్ కావాలంటే పది శాతం భూమిని పంచాయతీకి రాసివ్వాలి. అంటే 30 సెంట్లు భూమి ఇవ్వాలి. నిబంధనల మేరకు రహదారిని విడిచి పెట్టాలి. కానీ, పంచాయతీకి స్థలం ఇవ్వలేదు. పంచాయతీరాజ్ శాఖను ప్రశ్నిస్తే జిల్లా పరిషత్ రహదారి వేసిందంటూ తప్పుకున్నారు.

లేఅవుట్ అయినా సరే

అధికారిక లే అవుట్ అయినా సరే ప్రభుత్వ నిధులతో రహదారి, డ్రెయిన్‌లు ముందుగా నిర్మించ డానికి లేదు. అక్కడ ఇళ్లు నిర్మిస్తేనే మౌలిక వసతులు అభివృద్ధి చేయాలి. ఇందుకు లే అవుట్ యజమాని పది శాతం భూమిని పంచాయతీకి అప్పగించాలి. మరో పది శాతం సొమ్మును పంచాయతీకి చెల్లించాలి. అప్పుడే మౌలిక వసతులు కల్పిస్తారు. లేదంటే అనధికార లే అవుట్ అయితే స్థలం కొనుగోలుదారులు ఖాళీ స్థలం కోసమని 14 శాతం బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించాలి. స్థలం విస్తీర్ణం ఆధారంగా గజానికి నిర్ణీత రుసుము జరిమానా రూపంలో చెల్లించాలి. అప్పుడే ఇంటి నిర్మాణానికి ప్లాన్‌లు మంజూరుచేస్తారు. పంచాయతీ మౌలిక వసతులు కల్పిస్తుంది. అయితే జడ్పీ నుంచి నిధులు రప్పించి వైసీపీ ప్రజా ప్రతినిధి వెంచర్‌లో రహదారి వేశారు. దీనిపై పంచాయతీ అధికారులు మాత్రం రహదారి స్థలాన్ని ఇచ్చారు కాబట్టే సిమెంట్ రోడ్డు, డ్రెయిన్లు నిర్మించారంటూ వాదిస్తున్నారు. కూటమి నేతలుతమ పొలాల్లోనూ స్థలం ఇస్తామంటే.. మీకూ రహదారి వేస్తామంటూ వింత సమాధానం ఇచ్చారు.



అప్పుడే రైళ్లకు సంక్రాంతి రద్దీ

నరసాపురం, సెప్టెంబరు 16 : సంక్రాంతి పండుగకు నాలుగు నెలల సమయం వుంది. పండుగకు స్వగ్రామాలకు వచ్చే దూర ప్రాంతాల్లోని వారంతా 120 రోజుల ముందుగానే రైళ్లల్లో టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు. గత ఏడాది పండుగల వేళ పడిన కష్టాలు ఈసారి పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో చాలా మంది ముందుగానే అప్రమత్తమయ్యారు. అయినప్పటికీ చాలా మందికి నిరాశే మిగిలింది. జిల్లా మీదుగా నడిచే అన్ని ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిండుకున్నాయి. హైదరాబాద్ నుంచి నడిచే రైళ్లలో అత్యధిక డిమాండ్ ఉంది. నరసాపురం-లింగంపల్లి, విశాఖ-నాగర్‌సోల్, శేషాద్రి, సర్కార్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌ల్లో జనవరి 10 నుంచి 13 వరకు, అలాగే రిటర్న్ జర్నీలో 16 నుంచి 20 వరకు టికెట్లు లేవు.

జనవరి 10 నుంచి 13 వరకు నో బెర్త్


నరసాపురం-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 10 నుంచి 13 వరకు టిక్కెట్లు లేవు. స్లీపర్, ఏసీల్లో రిగ్రెట్ కనిపిస్తోంది. సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ జిల్లాలో ఆకివీడు, భీమవరం మీదుగా వెళుతుంది. ఇందులోనూ 10 నుంచి 14 వరకు స్లీపర్, ఏసీ తరగతుల్లో రిగ్రెట్ ఉంది. నాగర్‌సోల్ నుంచి సికింద్రాబాద్ మీదుగా నరసాపురం నడిచే ఎక్స్‌ప్రెస్‌లో 10న రిగ్రెట్ ఉంది. అదే తేదీన ఏసీలో 120 వెయిటింగ్ లిస్టు ఉంది. 11, 12 తేదీల్లో స్లీపర్‌ల్లో నో బెర్త్, 13న స్లీపర్‌లో 23 వెయిటింగ్ లిస్టు ఉంటే ఏసీల్లో 26 టిక్కెట్లు దొరుకుతున్నాయి. బెంగళూరు నుంచి ఆకివీడు, భీమవరం, తణుకు పట్టణాల మీదుగా వెళ్లే శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లోనూ టిక్కెట్లు లేవు. 10న స్లీపర్‌లో 43, ఏసీలో 50 వెయిటింగ్ లిస్టు ఉంది. 11న స్లీపర్‌లో 136, ఏసీలో 94 వెయిటింగ్ లిస్టు ఉంటే, 12న స్లీపర్‌లో ఆర్‌ఏసీ 150, ఏసీలో 31 వెయిటింగ్ లిస్టు ఉంది. ముంబయి నుంచి నుంచి ఆకివీడు, భీమవరం, తణుకు మీదుగా నడిచే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో 10, 11, 12 వెయిటింగ్ లిస్టులే చూపిస్తున్నాయి. 10న 41, 11న 66, 12న 15, ఏసీలో 21, 11న 23, 12న 3 వెయిటింగ్ లిస్టు ఉంది. ఇక చెన్నై నుంచి జిల్లా మీదుగా నడిచే సర్కార్‌లో 10న స్లీపర్‌లో 47, ఏసీలో 15, 11న స్లీపర్‌లో 10, ఏసీలో 15, 12న స్లీపర్‌లో 20, ఏసీలో మూడు వెయిటింగ్ లిస్టు కనిపిస్తున్నాయి.

బంగారు ఆభరణాలే ముంబై ముఠా టార్గెట్



తాడేపల్లిగూడెం క్రైం, సెప్టెంబరు 16: జిల్లాపై ముంబై ముఠా నిఘా వేసింది. బెంగాల్ నుంచి వచ్చే బంగారం తయారీదారులే లక్ష్యంగా రెచ్చిపోతోంది. తాజాగా తాడేపల్లిగూడెంలో బెంగాల్‌కు చెందిన బంగారం తయా రీదారులపై నిఘా పెట్టింది. ఇటీవల బెంగాల్‌కు చెందిన ఓ యువకుడు ఖార్ఖానాలో పనిచేసేందుకు చేతితో బంగారం పట్టుకుని వెళుతుండగా ముఠాలోని పెద్ద వ్యక్తి అతడిని బెంగాల్‌లో పిలిచాడు. ఆ యువకుడు ప్రాంతీయ అభిమానంతో వారితో మాటలు కలిపాడు. కొంతసేపటికి ముఠాలోని సభ్యులు అతనిపై మత్తు మందు చల్లి.. అతని చేతిలోని బంగారు వస్తువులు తీసుకుని నకిలీ గొలుసు పెట్టి పరారయ్యారు. మోసపోయానని గుర్తించిన యువకుడు యజమానికి చెప్పి పోలీసులను ఆశ్రయించారు. ఈ మోసానికి పాల్పడింది ముంబై టీమ్ అని వారు విచారణలో తేల్చారు. ఇదే మాదిరి ఈ ముఠా తణుకులోను చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. దొంగలు మత్తు చల్లి ప్రజల ముందే బంగారం, నగదు చోరీలకు పాల్పడుతున్న ఘటనతో వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. శనివారం మాధవరంలో ఓ మహిళపై మత్తు ప్రయోగించి 10 కాసుల బంగారం, రూ.5 లక్షల నగదు దోచుకుపోయారు. వరుస ఘటనలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఈ వారమూ అదే ఘాటు



భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 16 : అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు, వరదల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతినడంతో ఈ వారమూ ధరలు పెరిగాయి. ఆకు కూరల ధరలు గత వారంలాగే అందుబాటులోకి రాలేదు. ఐదు, పది రూపాయలకు దొరికే తోటకూర, గోంగూర, పాలకూర, చుక్క కూర కట్టలు ఇరవై నుంచి ముప్పయి రూపాయల వరకు అమ్ముతున్నారు. కొద్ది రోజులుగా ఇళ్లకు వచ్చి అమ్మే ఆకు కూరల వ్యాపారులు రావడం లేదు. ఉల్లి ఘాటు ఏ మాత్రం తగ్గడం లేదు. మార్కెట్‌లో ఆది, సోమవారాల్లో కిలో రూ.60కి విక్రయించారు. కూరగాయల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో నియంత్రణకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. రైతు బజార్ ద్వారా కొన్ని అందుబాటు ధరల్లో వుంచారు.

భీమవరం (కిలో.. రూపాయల్లో)

	మార్కెట్	రైతుబజార్
వంకాయలు	70	60
బెండకాయలు	50	40
దొండకాయలు	50	40
టమాటాలు	40	36
ఉల్లిపాయలు	60	55
పచ్చి మిర్చి	40	36
అల్లం	80	100
బంగాళాదుంప	40	40
బీరకాయలు	60	50
చిక్కుడు	200	-
ములక్కాడ (3)	20	-
అరటి(3)	20	-
కాలీఫ్లవర్	50	-
క్యాబేజీ-రూ	40	32
క్యారెట్	60	38
దోసకాయలు	40	40
కాకరకాయలు	40	40





• ఆకివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం : నిన్నటి వరకు ఇలా.. మార్పులు చేసిన తర్వాత నేటి నుంచి ఇలా...

పోడియం తొలగింది

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు

అత్తిలి/ఆచంట/ఆకివీడు, సెప్టెంబరు 16 : రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బ్రిటిష్ కాలం నాటి పద్ధతులకు స్వస్తి చెప్పింది. కార్యాలయాల్లోని ప్రత్యేక పోడియాన్ని రద్దు చేస్తూ ప్రజలను గౌరవించాలని నిర్ణయించింది. ఇతర ప్రభుత్వ కార్యాలయాల మాదిరిగానే ఒకేఫ్లోర్ కింద వాటిని తెచ్చేందుకు చర్యలు తీసుకుంది. రోజూ కోట్ల రూపాయల ఆదాయం వచ్చేలా చేస్తున్న సామాన్య ప్రజలకు కార్యాలయాల్లో గౌరవం ఉండాలని, వచ్చిన కక్షిదారులు నిలబడి ఉండే విధానానికి సెలవు పలకాలని నిర్ణయించింది. వచ్చిన వారికి కుర్చీలు, తాగు నీటితోపాటు అవకాశం ఉంటే టీ, కాఫీ సరఫరా చేయాలని ఆదేశించింది. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ కూడా ఎత్తులో కాకుండా సాధారణ ఫ్లోరింగ్ ఎత్తులోనే ఉండాలని సూచించింది. సబ్ రిజిస్ట్రార్‌కు ప్రజలకు మధ్య టేబుల్ తప్ప మరేమి అడ్డంగా ఉండకూడదని రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని భీమవరం, గునుపూడి, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం, ఆచంట, పెనుగొండ, అత్తిలి, తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, ఉండి, ఆకివీడు, తణుకు, సజ్జాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పోడియాలను తొలగించారు.

మళ్లీ స్టాంపుల విక్రయాలు

ఆస్తులు క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలు, అఫిడవిట్‌కు వినియోగించే స్టాంప్ పేపర్లు మళ్లీ అందుబాటులోకి రానున్నాయి. నాసిక్‌లో తయారయ్యే జ్యుడీషియల్ స్టాంప్‌ను, రిజిస్ట్రేషన్ అఫిడవిట్ ఒప్పందాలు తదితర కార్యకలాపాలకు వినియోగించేవారు. రూ.20, రూ.50, రూ.100 స్టాంపులు సుదీర్ఘకాలంగా మన్నికగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వీటిని కొనుగోలు చేయలేక నాసిక్ స్టాంపుల విక్రయాలను నిలిపివేసింది. ఈ స్టాంప్ పేరుతో నాసిరకం పత్రాలు అందుబాటులోకి తెచ్చింది. కొద్ది రోజులకే ఈ పత్రాలు చిరిగిపోతున్నాయంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. మరోవైపు వీటిపై సబ్ రిజిస్ట్రార్లు సమాధానం చెప్పలేక తలలు పట్టుకునేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణల పేరిట పాత విధానాన్ని అమలులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆదేశాలు మేరకు పోడియంను తొలగించామని అత్తిలి సబ్ రిజిస్ట్రార్ శివయ్య తెలిపారు. అదే విధంగా క్రయ విక్రయ దారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ముంపులోనే కొల్లేరు గ్రామాలు

జలదిగ్బంధంలోనే రహదారులు



ముంపులోనే కొల్లేటికోట రహదారి

కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 16: కొల్లేరులో నీటిమట్టం తగ్గుదల పట్టినా లంక గ్రామాల్లో పూర్తిస్థాయిలో తగ్గలేదు. రహదారులు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. మరో వారంపాటు ముంపులోనే అవస్థలు తప్పవని ఆయా గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంకకు, కైకలూరు మండలం పెంచి కలమర్రు నుంచి పందిరిపల్లిగూడెం, గుమ్మళ్ళపాడు, శృంగవ రప్పాడు గ్రామాలకు పడవ ప్రయాణం తప్పడం లేదు. నిత్యావసర వస్తువులు, మంచినీళ్ల కోసం ఈ పడవల్లోనే దూర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడుతూ స్వగ్రామాలకు చేరుతున్నారు. కైకలూరు మండలం సోమేశ్వరం నుంచి కొల్లేటికోటకు వెళ్లే రహదారిలో నీటి ప్రవాహం తగ్గినా రోడ్డు కోతకు గురై ప్రజలు ప్రయాణించ లేని పరిస్థితి. రోడ్లపై నాలుగడుగుల మేర నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు పడవల్లోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం మొండికోడు-గుడివాకలంక, రహదారిపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తోంది.

యువకుడిపై దాడి : గణేశ్ నిమజ్జనంలో ఉద్రిక్తత



రోడ్డుపై ఆందోళన చేస్తున్న దళిత యువకులు

కాళ్ళ, సెప్టెంబరు 16 : కాళ్ళ మండలం జువ్వలపాలెంలో సోమవారం రాత్రి గణేశ్ నిమజ్జనంలో ఓ యువకుడిపై దాడి ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలోని హోటల్లో పనిచేస్తున్న కాళ్ళకూరుకు చెందిన ఈదా యాకోబుపై ఓ వ్యక్తి దాడి చేశాడు. విషయం తెలుసు కున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకులు భారీ ఎత్తున చేరుకుని దాడి చేసిన వ్యక్తి వచ్చి యాకోబుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రీయ రహదారిపై గంటల తరబడి బైఠాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ జయసూర్య ఇతర పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరిపారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆందోళన విరమించారు.

అన్న కూటోత్సవం



పాలకొల్లుఅర్బన్, సెప్టెంబరు 16 : స్థానిక శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు 4వ రోజు సోమవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, శ్రీమహాలక్ష్మీ హవనం, అన్న కూటోత్సవం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి పవిత్ర వితరణ కార్యక్రమం నిర్వహించారు.



గణనాథుడి ఊరేగింపులో సందడి చేసిన మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, టీబీఆర్ సంస్థ అధినేత భోగేశ్వరరావు

గణనాథుడి ఊరేగింపు

పెంటపాడు, సెప్టెంబరు 16: అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ ప్రాంగణంలో నెలకొల్పిన గణనాథుడిని ఆ సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తొలుత ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన లక్కీ డిప్ డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ. 2.50ల విలువైన మోటార్ సైకిల్, రెండో బహుమతి రూ. 1.25 లక్షల విలువైన ఎలక్ట్రికల్ స్కూటీ, మూడో బహుమతి 10 గ్రాముల బంగారం కాయిన్, నాల్గో బహుమతి ఏసీ తదితర బహుమతులు 10 మందికి అందజేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేళతాళాలు, కేరళ నృత్యాలు బాణాసంచా కాల్పుల నడుమ స్వామి వారిని ఊరేగించి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. కూటమి నాయకులు నరిసే సోమేశ్వరరావు, చెరుకూరి జగత్ సోమశేఖర్, పాలిచర్ల ప్రసాద్, సంస్థ కరస్పాండెంట్ పద్మావతి, డైరక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 18 వ తేదీన టీబీఆర్ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు భోగేశ్వరరావు తెలిపారు.



హ్యాకథాన్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు

వచ్చే నెలలో జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీలు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 : ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25, 26 తేదీలలో హేకోవర్ ఫ్లో 2024 పేరిట 24గంటల హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు సోమవారం నాడు కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. వెబ్‌సైట్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోడింగ్ క్లబ్ కన్వీనర్ కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న హ్యాకథాన్‌లో మూడు ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిలో వ్యవసాయం, ఆరోగ్య భద్రత, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ అనే అంశాలపై నిర్వహించే హ్యాకథాన్‌లో 30వేల రూపాయలు విలువైన ప్రైజెస్ కూడా విజేతలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక దోపిడీ ఆగలేదు



పాలకొల్లు, సెప్టెంబరు 16: నిర్మాణ రంగం కుదేలైంది. ప్రభుత్వపరంగా పనులు లేనే లేవు. అయినా ఇసుక దోపిడీ మాత్రం ఆగలేదు. జిల్లాలోని పెండ్యాల, పందలపర్రు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ ఉంది. ఆన్‌లైన్ విధానం అమలులోకి వచ్చేంత వరకు ఇసుక ఎగుమతులు నిలుపుదల చేయమని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అప్పటికే పెండ్యాల స్టాక్ పాయింట్‌లో 135 లారీలకు కూపన్లు ఇచ్చారు. వాటిలో 60 లారీలకు చలానాలు రాసి ఎగుమతులు చేపట్టారు. మిగిలిన 65 లారీలకు అక్రమ పద్ధతుల్లో ఇసుక ఎగుమతి చేశారని ఆరోపణలు వినిపి స్తున్నాయి. పందలపర్రు స్టాక్ పాయింట్లో రికార్డుల పరంగా ఇసుక అయిపోయి నప్పటికీ ఇంకా సుమారు 20వేల టన్నుల ఇసుక ఉన్నట్టు చెబుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌కు విధి విధానాలు రూపొందించే వరకు ఇసుక ఎగుమతులు జరగకుండా నిలువరించాలని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నప్పటికీ ఎగుమతులు జరు గుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

వడ్డిగూడెంలో అగ్నిప్రమాదం



వీరవాసరం(భీమవరంటౌన్), సెప్టెంబరు 16 : వీరవాసరం మండలం వడ్డిగూడెంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. అదే గ్రామానికి చెందిన నేపాల బ్రహ్మం అనే వ్యక్తి ఇళ్ల ప్రమాదానికి గురైనట్టు అగ్ని మాపకశాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రమాదంలో గ్యాస్ సిలిండర్ పేలిపోవటంతో చుట్టప్రక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇంట్లో ఉంచుకున్న కొబ్బరికాయలు ఈ ప్రమాదంలో కాలిపోయాయి. గ్రామస్థులతోపాటు, పాలకొల్లు నుంచి వచ్చిన అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పుతున్నారు. ఈ ప్రమాదం గురించి పూర్తి సమాచారం రావలసి ఉంది.

రేకుల షెడ్డు దగ్ధం

భీమవరం క్రైం, సెప్టెంబరు 16 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేకుల షెడ్డు దగ్ధమైంది. భీమవరం అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు తెలిపిన వివరాలు ప్రకారం దిరుసుమర్రు గ్రామం కొత్త పేటలో కొప్ప వెంకట్రావుకు రేకుల షెడ్డు ఉన్నది. సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో వారు బయటకు వచ్చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు అక్కడకు వెళ్ళి మంటలను అదుపు చేశారు. లక్ష రూపాయల నగదు కాలిపోవడంతో పాటు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగినట్టు అగ్నిమాపక అధికారి తెలిపారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవ

వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు



మొగల్తూరు, సెప్టెంబరు 16: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం, చెత్తా చెదారాలను లేకుండా చేయడం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులను, గ్రామస్థులను భాగస్వాములు చేయడం, పారిశుధ్య కార్మికుల సహకారాన్ని గుర్తించడం ద్వారా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- 17వ తేదీన మానవహారాలు ఏర్పాటు చేయటం, రాజకీయ నాయకులు, సెలబ్రెటీలు, వివిపీలు, ప్రజలతో కూడిన సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌లు నిర్వహిస్తారు.
- 18వ తేదీన స్వచ్ఛతా పరుగు, సైకిల్/మారథాన్ లాంటివి నిర్వహించటం, దోమలు/చీడ పురుగుల నివారణ కోసం స్ప్రే చేయడం, నీటి నిల్వలను తొలగించుట అదే ప్రదేశంలో బ్లీచింగ్ చల్లుట వంటివి చేయాలి. పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స గురించి శిక్షణ ఇవ్వాలి.
- 19వ తేదీన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పబ్లిక్ ప్రదేశాలలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయడం, చెత్త దిబ్బలు గుర్తించడం, వాటిని తొలగించటం చేయాలి
- 20వ తేదీ చెట్లు నాటే కార్యక్రమాలు, తల్లి పేరుతో ఒక మొక్క నాటడం చేయాలి.
- 21న మెప్మా, ఎన్‌జీవోల సమన్వయంతో పారిశుధ్యంపై అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలి. ఉద్యానవనాలు శుభ్రపరుచుట, వాటిని నిర్వహించుట, అభివృద్ధి చేయుట, పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లు అందించడం,
- 22న మిషన్ లైఫ్ ప్రధాన కార్యక్రమాలు, మురుగునీటి కాలువలను పూడిక తీసి పరిశుభ్ర పరుచుట, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరిక్షలు చేయించడం.
- 23వ తేది సోమవారం వర్షపు నీటి నిర్మాణాలను నిర్వహించుట మరియు తనిఖీ చేయ్యుటకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం, రోడ్లను మరియు పాదచారుల మార్గాలను శుభ్రపరుచుట మరియు మరమ్మత్తులు చేయుట, పారిశుధ్య కార్మికులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరిక్షలు చేయించడం,
- 24న మంచినీటి వనరులు వాటి నిర్మాణాలను శుభ్రపరచుట, వాటి నిర్వహణపై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయుట, మంచినీటి వనరులు, నిర్మాణాలను శుభ్రపర్చుట, సూపర్ క్లోరినేషన్ చేయుట, నీటి పరీక్షలు, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వ్యక్తిగత రక్షణపై అవగాహన కల్పించడం.
- 25న కళాజాతలు, వీధి నాటకాల ప్రదర్శనలు, దుకాణాలు మార్కెట్ ప్రదేశాలలో పారిశుధ్యం నిర్వహించుట
- 26న సైబర్ స్వచ్ఛత, డిజిటల్ స్వచ్ఛత. అవసరం లేని /అభద్రత యాప్‌లను తొలగించుట గురించి అవగాహన, ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలను శుభ్రపరచటం, పారిశుధ్య కార్మికుల పిల్లల సంరక్షణా/ఆదరణ కార్యక్రమాలు, విద్యా ఉపకార వేతనాలు అందించుట.
- 27న గ్రామ సభలు, పార్కులు, స్థలాలు, ఫ్లై ఓవర్‌లు, సెల్ఫీ పాయింట్లను సుందరీకరించుట.
- 28న ఘన వ్యర్థాల నిర్వహణ, అధిక జన సంచార ప్రదేశాలను శుభ్రపరుచుట, పునర్వినియోగపరిచే వస్తువులను సేకరించి వాటిని రీసైకిల్ కేంద్రాలకు తరలించుట, అవసరమైన ముందస్తు వ్యాక్సినేషన్ చేయించుట.
- 29న గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ పెయింటింగ్‌లు వేయించుట. అభయారణ్య జంతు ప్రదర్శన శాలలు, బీచ్‌లను శుభ్రపర్చడం, పారిశుధ్య కార్మికులకు బీమా పథకాలు నమోదు
- 30న చెత్తను పునర్వినియోగపరిచేలా వర్మీ తయారు చేయుటపై ప్రజలకు అవగాహనా ప్రదర్శనలు, చెత్త నిర్వహణపై అవగాహన, వీధులను శుభ్రపరిచే శిబిరాలు సంఘాల వారీగా నిర్వహించుట, పారిశుధ్య కార్మికులకు బీమా పథకాలు నమోదు చేయుట.
- అక్టోబర్ 1న కమ్యూనిటీ టాయ్‌లెట్స్, పబ్లిక్ టాయ్‌లెట్స్ శుభ్రపరుచుట ఉత్తమ పారిశుధ్య కార్మికులను గుర్తించి వారిని సన్మానించుటం.



పాలకొల్లులో ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

జగన్ పాలనలో అభివృద్ధి వెనక్కి

మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 16: రాష్ట్రంలో ఎక్కడ చూసినా జగన్ సృష్టించిన విధ్వంసాలే కనబడుతున్నాయని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. సోమవారం ఆయన పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మాణ పనులను, బొండాడ వెంకటరాజు గుప్తా ఎన్టీఆర్ కళాక్షేత్రం, రామగుండం పార్కు, శంభుని చెర్వు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనులు వేగవంతంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో నిర్మాణాలన్నీ గాలికొదిలేశారన్నారు. అభివృద్ధి 20ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో వందపడకల ఆసుపత్రిని పూర్తి చేసి అన్ని సదుపాయాలతో ప్రారంభించి పాలకొల్లు పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏపీ మెడికల్ కార్పొరేషన్ ఈఈ బీవీ.గిరి, డీఈ యం.శ్రీనివాసరెడ్డి మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, బోనం చినబాబు, కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.

రేవుల్లో ప్రయాణికుల సందడి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 16: నరసాపురం - సఖినేటిపల్లి మధ్య సోమవారం రాకపోకలు పునరుద్ధణయ్యాయి. రెండు రేవుల నుంచి పంట్లు తిరగడంతో పట్టణంలోని మాధవాయిపాలెం రేవులో సందడి కనిపించింది. ఇటు వశిష్ఠ గోదావరిలో వరద సాధారణ స్థితికి చేరింది. రేవుల్లో నీటిమట్టాలు తగ్గడంతో మెట్లపై బురద మట్టి పేరుకుపోయింది. దీంతో స్నానాలకు దిగేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి మెట్లను శుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు.

ఏటా ఏదోచోట పేలుడు... దీపావళికి సన్నద్ధమవుతున్న తయారీ దారులు

నిబంధనలు పట్టని హోల్‌సేల్ వ్యాపారులు

బాణసంచా భద్రత ఎంత..?



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 16: బాణసంచా తయారీ, విక్రయాల్లో భద్రత లేక నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. ఒక పక్క తయారీ కేంద్రాలు మరోపక్క హోల్‌సేల్ వ్యాపారుల కక్కుర్తికి ప్రతీఏటా ఏదోచోటా బాణసంచా పేలుళ్లతో అధికారులు హడావుడి తప్ప ముందస్తు తనిఖీలు, భద్రతపై ఆంక్షలు లేకుండా సాగిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాణసంచా తయారీ కేంద్రాలు జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఎక్కువ. గతేడాది తాడేపల్లిగూడెం మండలం కడియద్ద వద్ద బాణ సంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనంలో ముగ్గురు కూలీలు బలైపోవడంతో అధికారులు అప్రమత్తమై జిల్లాలో తయారీ కేంద్రాలకు అనుమతి ఇవ్వలేదు. అయినా తయారీ యథేచ్ఛగా సాగాయి. వీటికి తోడు బాణసంచా హోల్‌సేల్ షాపుల్లో భద్రత అంతంత మాత్రమే. షాపులకు ఇచ్చిన అనుమతికి మించి బాణసంచా నిల్వలు ఉంచడంతోపాటు, ఒక లైసెన్స్‌తో మరికొన్ని షాపులు నిర్వహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బాణసంచా తయారీ కేంద్రాల వద్ద భద్రత పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

విజయవాడ పేలుడులోనూ..

రెండేళ్ల క్రితం విజయవాడ బాణసంచా విక్రయకేంద్రాల వద్ద పేలుడు సంభవించి పలువురు మృతి చెందిన ఘటన వెనుక తాడేపల్లిగూడెం హోల్‌సేల్ దుకాణంలో విక్రయించిన పేలుడు పదార్థాల వల్లే సంభవించిందని పోలీసులు నిర్ధారించి ఇక్కడ హోల్‌సేల్ దుకాణ నిర్వాహకులపై కేసులు నమోదుచేశారు. అంటే తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ దుకాణాలపై నియంత్రణ చేస్తే ప్రజల ప్రాణాలకు రక్షణ దొరుకుతుంది.

ఏటా ఏదో ప్రమాదం...

దీపావళి పండుగ కోసం బాణసంచా తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ దుకాణాలలో నిబంధనలకు పాతర వేస్తుండటంతో ప్రమాదాలు తరచూ జరుగుతూ అధికారుల తనిఖీల్లో డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. 2010లో జిల్లాలోనే అత్యంత భయంకరమైన ప్రమాదం ఉంగుటూరు మండలం వెల్లమిల్లిలో భారీ విస్ఫోటనం జరిగి 8 మంది మృత్యువాత పడగా ప్రతి ఏటా ఏదోచోట ప్రమాదాలకు అమాయకులు బలవుతూనే ఉన్నారు. అనుమతులకు మించి బాణసంచా నిల్వలు ఉంటున్నా దుకాణాల్లో, తయారీ కేంద్రాల్లో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు.

క్రైం కార్నర్

మిషన్‌లో పడి యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16: అదృశ్యమైన వ్యక్తి తాను పనిచేస్తున్న మిషన్‌లోనే పడి ఆత్మహత్య చేసుకున్నట్టుగా పోలీసులు గుర్తించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బీహార్‌నకు చెందిన కొంతమంది ఏలూరు - ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని వేసగాని బ్రిడ్జి పక్కనే ఉన్న విజయ దుర్గ ట్రేడర్స్‌లో పనిచేస్తున్నారు. ప్లాస్టిక్ బాటిల్స్‌ను మిషన్ ద్వారా క్రషింగ్ చేసి బేళ్ళుగా చేస్తారు. బీహార్ నుంచి వచ్చిన వారిలో పుల్బర్‌శర్మ (35) ఆ పని చేస్తున్నాడు. ఈనెల 15వ తేదీ రాత్రి అతను పనిచేస్తున్న మిషన్‌లోనే పడి బటన్ నొక్కుకోవడంతో ప్లాస్టిక్ బాటిల్స్‌తో పాటు అతను కూడా నుజ్జు నుజ్జు అయ్యాడు. సోమవారం ఉదయం పోలీసులు నుజ్జయిన మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఉన్న సీసీ పుటేజ్‌లను పోలీసులు పరిశీలించారు. తాను ఒక్కడే మిషన్ ఆన్‌చేసి లోపలకి వెళ్ళి కూర్చోవడంతో మిషన్ అతనిని నొక్కేసింది. దీంతో అతను మరణించాడు. ఈ దృశ్యాన్ని సీసీ పుటేజ్‌లో రికార్డు అయ్యాయి. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీహార్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

కుమార్తెకు గాయాలు

ఉంగుటూరు,సెప్టెంబరు 16: జాతీయ రహదారిపై బాదంపూడి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తాడేపల్లిగూడెం మహాలక్ష్మి నగర్‌కు చెందిన బాదరాల సువార్త వాణి(47) ఆదివారం రాత్రి తన కుమార్తె అమూల్యతో కలిసి బాదంపూడిలో ప్రార్థన అనంతరం తన ఇల్లు తాడేపల్లిగూడేనికి స్కూటీపై వెళుతుండగా సిరామిక్ టైల్స్ బజార్(గోడౌను) సమీపంలో జాతీయ రహదారి పై అదుపు తప్పింది. కుమార్తెకు స్వల్ప గాయాలవ్వగా, తల్లి సువార్తవాణికి తీవ్ర గాయం అవ్వగా ఆమెను తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చేబ్రోలు ఎస్‌ఐ సూర్య భగవాన్ తెలిపారు. మృతురాలి భర్త (పాస్టర్) బాదరాల మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి



ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

కొయ్యలగూడెం, సెప్టెంబరు 16: అదుపు తప్పి కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు (62) కొడుకుకోడలు, మనవడితో కలిసి మారుతికారులో నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో ఒక శుభకార్యానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కొయ్యలగూడెం మండలం ఆరిపాటి దిబ్బల వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. డ్రైవింగ్ చేస్తున్న తండ్రి వెంకటేశ్వరరావు తీవ్రగాయాలతో మృతి చెందాడు. కొడుకు నాగవెంకట రామారావు, కోడలు సౌజన్య, మనవడుకి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వైద్యురాలిపై దురుసు ప్రవర్తన

పోలీసులకు ఫిర్యాదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16 : ఘర్షణ పడ్డ వ్యక్తులు ఆసుపత్రికి రాగా వారితో పాటు వచ్చిన ఒక వ్యక్తి డ్యూటీ వైద్యురాలిపై దురుసుగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ వైద్యురాలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగంలో ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి ఒక వైద్యురాలు విధులను నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆ వైద్యురాలు ఏడవ నెల గర్భిణీ. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో దెందులూరు మండలం ఉండ్రాజవరం గ్రామం నుంచి కొంత మంది ఘర్షణ పడ్డ వ్యక్తులు ఆసుపత్రికి వచ్చారు. తమకు ఎమ్మెల్సీ చేయాలని వారు కోరారు. అయితే ముందు వైద్యం చేయించుకోమని సూచించారు. కాని ఆ వ్యక్తులతో పాటు వచ్చిన పోతునూరుకు చెందిన బొడ్డేటి మోహన్ అనే వ్యక్తి ఆ వైద్యురాలిని ఏక వచనంతో మాట్లాడుతూ ముందు ఎమ్మెల్సీ చేయి అంటూ బెదిరింపులకు దిగాడు. అతనిని బయటకు వెళ్ళమని వైద్యురాలు చెప్పడంతో కొట్టడానికి మీదకు వెళ్ళాడని అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్ష్యులు చెప్తున్నారు. తెల్లవారేటప్పటికి ఉద్యోగాన్ని తీయిస్తానని బెదిరింపులకు దిగడంతో ఆ వైద్యురాలు ఈ సంఘనటపై రాత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఇప్పటి వరకూ ఎలాంటి చర్య తీసుకోలేదని ఆ వైద్యురాలు వాపోతున్నారు. ఇది ఇలా ఉండగా బెదిరింపులకు దిగిన వ్యక్తి మరి కొంత మంది ఆసుపత్రి వద్దకు వచ్చి హడావుడి చేసి భయభ్రాంతులకు గురి చేసి వెళ్ళాడని చెబుతున్నారు. ఫిర్యాదుపై తక్షణం పోలీసులు స్పందిస్తే అతను ఆసుపత్రికి వచ్చేవాడు కాదని ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఆ వ్యక్తి తాము అధికారపార్టీకి చెందిన నాయకుడినని చెప్పుకుని బెదిరింపులకు దిగాడని చెబుతున్నారు. ఈ సంఘటనపై మంగళవారం ఆసుపత్రి ఉద్యోగులు, వైద్యులు ధర్నా నిర్వహించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16 : వేగంగా వెళ్తున్న రైలు భోగీ గుమ్మంలో నిలబడ్డ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అస్సాం రాష్ట్రానికి చెందిన జైదుల్ ఇస్లాం (29) మైసూర్ నుంచి హౌరాకు రైలులో ప్రయాణిస్తున్నాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని కొయ్యూరు రైల్వే గేటు వద్ద ప్రమాదవ శాత్తు జారిపడి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ పి సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

కోడి పందేలపై దాడి

కాళ్ళ, సెప్టెంబరు 16 : ఏలూరుపాడు సంతపేట ఏరియాలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ.1950 నగదు, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఏడుగురిపై కేసు నమోదు

భీమడోలు, సెప్టెంబర్ 16 : చేపల చెరువులకు కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి దీనికి సంబంధించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. విజయవాడ నుంచి అంబర్‌పేట చేపల చెరువులకు తరలిస్తున్న కోడి వ్యర్థాలను పోలీసులు అడ్డుకున్నారు. చేపల చెరువు రైతు వినాయక్, వాహనం యజమాని సాంబశివరావు, కోడి వ్యర్థాల అమ్మకాలకు సంబంధించిన మధ్య వర్తి భలే సుబ్బరాజుతో పాటు వాహనాన డ్రైవర్, మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై దాడి

టి.నరసాపురం, సెప్టెంబరు 16: మహిళపై దాడిచేసి కొట్టి గాయపరిచిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన సందిపాము లక్ష్మి ఈనెల 13 రాత్రి తన కోడలిని తిడుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన తడికమళ్ళ వాసు మరొకరు తమని తిడుతుందని భావించారు. దీనితో లక్ష్మిపై దాడిచేసి కొట్టి గాయపరిచారని ఆమెను చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్టు

పెంటపాడు, సెప్టెంబరు 16: చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పెంటపాడు ఎస్‌ఐ స్వామి సోమవారం అరెస్టు చేశారు. చిలకంపాడు లాకుల వద్ద ఈ నెల 14వ తేదీ రాత్రి కిందుల రాంబాబుకు చెందిన రేకుల షెడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి సుమారు 80 వేల విలువ చేసే సెకండ్ హ్యాండ్ మోటార్ సైకిల్, 8 కోళ్ళు దొంగిలించారు. సోమవారం పెంటపాడు కాలేజీసెంటర్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. స్టేషన్‌కు తీసుకువెళ్ళి విచారించగా దొంగతనం చేసింది వీరే నని రుజువైంది. దీంతో తాడేపల్లిగూడెంకు చెందిన యంగి ఏసురత్నం (అలియాస్ కోటయ్య), యర్రసాని వీర్రాజు, ఉయ్యాల నాగరాజులను ఎస్‌ఐ అరెస్టు చేశారు. గతంలో కూడా వీరిపై తాడేపల్లిగూడెం టౌన్, పాలకొల్లు టౌన్, తాళ్ళపూడి పోలీస్‌స్టేషన్‌లలో మోటార్ సైకిళ్ళ చోరీ, గంజాయి కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరు దొంగిలించిన మోటార్ సైకిల్, కోళ్ళు రికవరి చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16: జూలై 22వ తేదీ రాత్రి పట్టణంలోని మార్కండేయపురంలో తాళం వేసిఉన్న ఇంట్లో దొంగతనం చేసిన కేసులో కామవరపుకోట మండలం రావికంపాడుకు చెందిన యడ్లపల్లి హేమంత్ ను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వి.కృష్ణబాబు తెలిపారు. అతని నుంచి చోరీ సొమ్ము రికవరీ చేసి రిమాండ్ నిమిత్తం ఏలూరు సబ్‌జైల్ కు పంపించినట్లు తెలిపారు. నేరస్థుడిని పట్టుకోవడానికి సహకరించిన ఎస్సై ఎస్‌కె.జబీర్, ఏఎస్సైలు సంపత్,రాజేంద్ర ఇతర పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



చికిత్స పొందుతున్న క్షత గాత్రుడు రమేశ్... ప్రమాదానికి కారణమైన కారు

భీమడోలు, సెప్టెంబర్ 16 : మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన గుండుగొలను జాతీయ రహదారిపై జరిగింది. ఏలూరుకు చెందిన ఎన్.స్వాతి, రమేష్, వీరి కొడుకు చేతనేశ్వర్ మోటారు సైకిల్‌పై ఏలూరు నుంచి గణపవరం మండలంలోని బావాయిపాలెంలో జరుగుతున్న ఒక ఫంక్షన్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో గుండుగొలను సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్వాతికి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. భర్త రమేష్, కొడుకు చేతనేశ్వర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. స్వాతిని తొలుత ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. దెందులూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామ

ఆకివీడు, సెప్టెంబరు 16 : పట్టణాభివృద్ధికి అందరూ సహకరిస్తే సుందరంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. స్థానిక దొరగారి, ఆనాల, భుజబలరాయుడు మంచినీటి చెరువులు, వాటి ఆక్రమణలతో పాటు గంగానమ్మకోడ్ బోదె ఆక్రమణలు సోమవారం పరిశీలించారు. ఆక్రమణదారుల్లో పేదలుంటే తాళ్ళకోడ్‌లో స్థలాలు ఇస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేసుకొనే వరకూ అద్దె కూడా చెల్లిస్తామన్నారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని సూచించారు. టీడీపీ, జనసేన మండల-పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, బాలాజీ, పిల్లా బాబులు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్, మేనేజరు వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

కాళ్ళ, సెప్టెంబరు 16 : కోమటిగుంటలో మురుగుకాలువ, ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని గ్రామ పెద్దలు, పంచాయితీ అధికారులను కోరినట్లు సోమవారం తెలిపారు. కాలనీలో ప్రభుత్వం స్థలాలు ఇచ్చినప్పటికీ వెళ్లడం లేదని తెలిపారు. దీని వలన గ్రామంలో చిన్నపాటి వర్షం వస్తే మురుగునీరు వెళ్లక రహదారులు ముంపునకు గురవుతున్నాయని వాపోయారు. సర్పంచ్ బోనం భాగ్యశ్రీ శివకుమార్, ఎరుబండి రామాంజనేయులు, వార్డు మెంబర్ యలమంచిలి శ్రీనివాస్, నక్కన శ్రీను తదితరులు సచివాలయ సెక్రటరీ వెంకటరమణ, వాసు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి కంపోస్టు యార్డు సమస్య


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్, సెప్టెంబరు 16: కంపోస్టు యార్డు సమస్య పరిష్కరించాలని మంగళగుంటపాలెం గ్రామస్తులు ఎమ్మెల్యే నాయకర్‌కు విన్నవించారు. ప్రతి పాదించిన కంపోస్టు యార్డు స్థలాన్ని గ్రామస్తులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇళ్ళ మధ్య కంపోస్టు యార్డు పెడితే తాము ఇక్కడ ఉండలేం, మా పొలాలన్నీ నాశనమవుతాయని ఆందోళన చెందారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాసా సత్యనారాయణ, వెంకట రామారావు, రమేష్, దుర్గ, చందు, వెంకటేశ్వరావు, గంగభవాని, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నూతన దుస్తులు అందజేత


మహిళా కార్యకర్తలతో మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర, తదితరులు

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 16 : సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన మహిళా కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ నూతన దుస్తులు అందించడం అభినందనీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ స్వగ్రామం కాపవరంలో సోమవారం మహిళలకు నూతన దుస్తులను అందించారు. అంగరతో పాటు మాజీ సర్పంచ్ కె.వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ పి.విజయలక్ష్మీ, ఉప సర్పంచ్ ఎ.వీరభద్ర కుమార్ (చిన్న), తదితరులు పాల్గొన్నారు.

జీవరాశికి రక్షణ కవచం 'ఓజోన్'


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి, తదితరులు

భీమవరంటౌన్, సెప్టెంబరు 16: ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యతని, జీవరాశికి రక్షణ కవచం ఓజోన్ పొర అని మున్సిపల్ కమిషనర్ కె.రామ చంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాల యంలో సోమవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఏంతఃవోవేంద్ర వెంకటరావు, శ్రీనివాస్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వలన ఓజోన్ పొర క్షీణించి పోతోందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. శానిటరీ ఇనస్పెక్టర్ వేంద్ర ప్రసాద్, ఆదినారాయణ, చంటి, మున్సిపల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

సాటి మనిషికి సేవ.. సామాజిక బాధ్యత


మధుసూదనరావును సత్కరించిన దృశ్యం

భీమవరం టౌన్, సెప్టెంబరు 16 : కష్టకాలంలో ఉన్న సాటి మనిషికి సాయం చేయడం సామాజిక బాధ్యతని ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు, మధుమణి సూపర్ స్పెషలిటీ హాస్పటల్ వైద్యుడు మధుసూదనరావు (నంద్యాల) అన్నారు. భీమవరం చైతన్య భారతి నాటక పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన మధుసూదన్‌రావును పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, కార్యదర్శి మంతెన రామ్‌కుమర్ రాజు, కోశాధికారి బొండా రాంబాబు సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ ఏటా జూలైలో ఏడు రోజులు కంటి ఆపరేషన్ ఏదైన ఉచితంగా చేస్తారని, ప్రతి సంవత్సరం కళాకారులను గౌరవిస్తారని, ఇలాంటి వ్యక్తిని గౌరవించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆర్.శ్రీనివాసమూర్తి, డాక్టర్ కె.సత్యనారాయణ, ఎస్.మహేష్ కుమార్, తదితరలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం

భీమవరం టౌన్, సెప్టెంబరు 16 : పట్టణంలోని నాచువారి సెంటర్‌లోని శ్రీకనకదుర్గమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల ప్రారంభ పందిరి రాట ముహూర్తాన్ని సోమవారం నిర్వహించారు. ఒంటెద్దు బళ్ల సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశువుల దాణా అందజేత

యలమంచిలి, సెప్టెంబరు 16: వరద ముంపు బారి నపడ్డ కనకాయలంక, పెదల oక గ్రామాల్లో పాడిరైతులకు సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల దాణా పంపిణీ చేశారు. కనకాయలంకలో 12, పెదలంకలో ఎనిమిది టన్నులను కూటమి నాయకులు అందజేశారు. పెదలంక సర్పంచ్ టి.నాగరాజు, మండల టీడపీ అధ్యక్షుడు ఎం.పెద్దిరాజు, మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి, ఎన్డీఏ నాయకులు కె.గోపి, ఎ.రామశ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, కె.వరబాబు, ఎం.రత్నంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

అత్తిలి, సెప్టెంబరు 16 : ఎమ్మెల్సీ ఎన్నికలపై అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పక్షాలతో తహసీల్దార్ దశిక వంశీ సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అత్తిలిలో పోలింగ్ నిమిత్తం ఏర్పాటు చేసిన బాలుర ప్రాథమికోన్నత పాఠశాలను తహసీల్దార్ పరిశీలించారు.

నులి పురుగుల నివారణ దినోత్సవం

మొగల్తూరు,సెప్టెంబరు16: నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు.


యలమంచిలి, పోడూరు, కాళ్ల మండలం దొడ్డనపూడి, భీమవరం గునుపూడిలో మేళతాళాలు, భాజా భజంత్రిలు, బాణసంచా కాల్పులు, విచిత్ర వేషధారణలతో సాగుతున్న విఘ్నేశ్వరుని ఊరేగింపులు

గంగమ్మ చెంతకు గణనాథుడు

» వైభవంగా నిమజ్జనాలు » ముగిసిన వినాయక చవితి ఉత్సవాలు
» హాజరైన, ఎమ్మెల్యేలు అంజిబాబు, రఘురామకృష్ణరాజు

గణనాథుడు గంగమ్మ చెంతకు బయలుదేరాడు. మేళతాళాలు, భాజా భజంత్రీల, బాణసంచా కాల్పుల ఊరేగింపుతో గంగమ్మ ఒడిలో నిమజ్జనమయ్యాడు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్న సమారాధనలు, వినాయకుడుకి లడ్డూలకి వేలం నిర్వహించారు.

భీమవరం టౌన్, సెప్టెంబరు 16 : శ్రీమావుళ్ళమ్మ ఆలయంలో గణపతి నవరాత్రి మహోత్సవంలో భాగంగా నిర్వహించిన అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వినాయకుని విగ్రహానికి ఊరేగింపు నిర్వహించి తాడేరు కాలవలో నిమంజ్జనం చేశారు. గునుపూడిలో నిర్వహించిన ఊరేగింపులో కోలాటం ఆకట్టుకుంది. సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్, కార్యదర్శి మారెళ్ళ అఖి లేష్, సభ్యులు పాల్గొన్నారు. 18,19 వార్డుల్లోని పసుపులేటి వారి వీధిలో అన్న సమారాధన రాష్ట్ర టీడీపీ కోశాధికారి మెంటే పార్థసారథి ప్రారంభించారు. తోట బోగయ్య, ఎస్‌కే రబ్బాని, హమ్మఖ లాల్ జైన్ భక్తులు శేషాద్రి హరిబాబు, కాళీకొండ, ఆకుల గణేష్, సుంకర నరేష్ ,ఎ.ఈ.ఇర్ఫాన్, ఆకుల బాలాజీ ,శేషాద్రి కృష్ణ, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్ర దానం

ఉండి : వృద్ధులకు వస్త్ర దానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. సాలిపేటలో శ్రీసిద్ధి వినాయక స్వామివారి ఉత్సవాలు ముగింపు పురష్కరించుకుని 62 వృద్ధులకు వస్త్రాదానం చేసి అఖండ అన్న సమారాదన నిర్వహించారు. ఎమ్మెల్యేని సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రావ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మంతెన సాయిలచ్చిరాజు, ముదునూరి కృష్ణంరాజు, గురుగుబిల్లి సత్యనారాయణ, మాసాబత్తుల బ్రదర్స్, పాల్గొన్నారు.


గణనాథుని నిమజ్జన సందడి

● తాడేపల్లిగూడెం రూరల్/ పాలకొల్లు అర్బన్/పాలకొల్లు రూరల్/కాళ్ళ/పాలకోడేరు/పోడూరు/యలమంచిలి/ఆచంట/పెనుగొండ/అత్తిలి/పెనుమంత్ర/మొగల్తూరు: కాళ్ళ మండలం దొడ్డనపూడిలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వద్ద ఏర్పాటు చేసిన 12 అడుగులు గణనాథుని నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జి.సాయి, సీహెచ్.దేవిప్రసాద్, ఎస్.శ్రీకాంత్, సంతోషి రూప దంపతులు, తదితరులు పాల్గొన్నారు. పాలకోడేరులోని గరువు వద్ద ఉన్న వరసిద్ధి వినాయకుని ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పోడూరు గ్రామం శివారు కొత్తపేటలో ఏర్పాటు చేసిన భారీ మట్టి వినాయకుడుకి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. సరళదొడ్డిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెనుగొండ సిద్ధాంతం నిర్వహించిన ఊరేగింపులో వైజాగ్ మహిళల కోలాటం ఆకటుకుంది. ఘటాల దెబ్బ శ్రీ లక్ష్మి గణేష్ యూత్ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో స్వామిని పచ్చి పూలతో అలంకరించిన గ్రామోత్సవం నిర్వహించారు. అత్తిలి గణేష్ చౌక్ వద్ద కల్యాణ గణపతి ఆలయంలో జి.విఠల బాలాజీ, వి.కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం హోమాన్ని నిర్వహించింది. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద చవితి వేడుకల్లో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జి.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎన్.బుల్లియ్య, నాయకులు ఎ.ఏడుకొండలు, కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మొగల్తూరులో శక్తి వేషాలు


పెనుగొండలో బేతాళ నృత్యాలు


ఆచంట మండలం కరుగోరుమిల్లిలో ఆటోపై ఊరేంగిపుగా నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


తాడేపల్లిగూడెం మండలంలో రథంలో స్వామివారి ఊరేగింపు

సీఎం సహాయ నిధికి విరాళాలు


రూ. రెండు లక్షల చెక్కును ఎమ్మెల్యే అంజిబాబుకు అందజేస్తున్న సభ్యులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 16 : కష్ట సమయంలో బాధితులను ఆదుకోవడానికి దాతలు స్పందించడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ రూ. రెండు లక్షల సహాయాన్ని వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. ఎస్.రామారావు, కె.వెంకటరాజు, కె.బాల, జె.మధుసుధన్ రావు, ఎ.రమేష్, ఎం.రాంప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం మాజీ సర్పంచ్ బస్వాని చంద్రరావు రూ.20 వేలను ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. సీహెచ్.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.


వలవల బాబ్జి కి విరాళాలు అందజేస్తున్న మీనవల్లూరు టీడీపీ నాయకులు

వరద బాధితుల కోసం విరాళాలు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితుల సహాయం కోసం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపు మేరకు ఆయా గ్రామాల నుంచి పలువురు ఆ పార్టీ నాయకులు స్థానిక టీడీపీ కార్యాలయంలో బాబ్జికి విరాళాలు అందజేశారు. మీనవల్లూరు టీడీపీ నాయకులు రూ. 45,100, మౌంజిపాడు నుంచి రూ. 30 వేలు, మాధవరం నుంచి రూ. 25 వేలు, కొమ్ముగూడెం భజన సమాజం రూ. 10,120, మారంపల్లి రజక సంఘం రూ. 6 వేలు విరాళం అందజేశారు. కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

రూ.50 వేలు చెక్కు అందజేత



తణకు, సెప్టెంబరు 16: విజయ వాడ వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి రూ. 50 వేల చెక్కును ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు అందజేసినట్లు టీడీపీ నాయకుడు కంటిపూడి రాంబాబు తెలిపారు. తణుకుకు చెందిన ఊట్ల విశ్వజ్యోతి ఈ ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు.

రూ. 25 వేల విరాళం



అత్తిలి, సెప్టెంబరు 16 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం అత్తిలి టీడీపీ నాయకుడు కందుల శ్రీనివాస్ ఆయన కుమారుడు చైతన్య రూ. 25 వేలను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు విరాళంగా అందజేశారు. వీరిని ఎమ్మెల్యే అభినందించారు.

సృష్టికర్తకు మాత్రమే భయపడాలి : అంజిబాబు

భీమవరంటౌన్, సెప్టెంబరు 16 : మానవులు తోటివారిని, సమాజాన్ని ప్రేమించాలన్నదే మహమ్మద్ ప్రవక్త సందేశమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం అంకాల ఆర్ట్ అకాడమీలో జమాత్ ఎ ఇస్లామీ హింద్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అంజిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ జమాత్ ఎ ఇస్లామి హింద్ అధ్యక్షుడు జనాబ్ ముహమ్మద్ రఫీఖ్ సాహెబ్ మాట్లాడుతూ ఈద్ అల్ అదాను త్యాగాల పండుగగా పిలుస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ, జమాత్-ఎ-ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు జనాబ్ సయ్యద్ ఫర్హాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు

● గణపవరం : మహ్మద్ ప్రవక్త బోధనలు, ఆయన చూపిన మార్గం సర్వమానవాళికి ఆదర్శమని మసీదు పెద్ద గురువు అరమన్ రజాక్ ఖదారి అన్నారు. గణపవరం మసీదులో ముస్లింలు ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త స్నేహాన్ని, ఆత్మీయతను, మంచితనాన్ని పంచాడని ఆయన చూపిన దైవిక మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మసీదులో మిఠాయిలు పంచారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

● పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 16 : ముస్లింలకు పవిత్రమైన పండుగల్లో మిలాద్ ఉన్‌నబి సందర్భంగా సోమవారం స్థానిక మసీదులో సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ముస్లీం పెద్దలు మాట్లాడుతూ ఇస్లామ్ యొక్క చివరి ప్రవక్త మహ్మద్ ప్రవక్త జన్మదినం జరుపుకుంటామని తెలిపారు. ఇస్లామ్ క్యాలెండర్‌లో మూడవ నెలలో 3వ రబీఉల్ - అవ్వల్ 12వ తేదీన వస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మసీదు పెద్దలు ఎండి మస్తాన్ వలిఖాన్, ఎండి జానీ, షేక్ సిలార్, రసూల్, షేక్ నజీర్, షేక్ బాబాజీ, షేక్ సాగన్న తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

రహదారులకు మరమ్మతులు



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 16: కొత్తూరులో నవాబుపాలెం- ఆరుగొలను మార్గంలో రహదారి గోతుల మయం కావడంతో కూటమి నాయకులు స్వచ్ఛందంగా కంకర, నల్ల చిప్స్ వేసి గోతులు పూడ్చడంతో పాటు రోడ్డు చదును చేశారు. సర్పంచ్ కూడవల్లి హనుమంతు, ఎంపీటీసీ ఉప్పు నరసింహారావు నాయకత్వం వహించారు.

ఉచితంగా కంటి ఆపరేషన్



తణుకు, సెప్టెంబరు 16: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ట్రస్టు, నిసా హాస్పిటల్ సంయుక్త సహకారంతో నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకుకు చెందిన ఎ.దుర్గారావుకు ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిం చారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు బాలిక మృతిపై విచారణ

భీమవరంటౌన్, సెప్టెంబరు 16 : ఉండి మండలం మహదేవ పట్నంకు చెందిన తుమ్మడి మదుర(7) పాము కాటు మృతి ఘటనపై విచారణాధికారిగా అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ భానునాయక్ నియమిస్తున్నట్లు డీఎంహెచ్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. మధుర పాముకాటుకు గురి అవ్వడంతో భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురావటం, వారు జాయిన్ చేసుకున్న రెండు గంటల తరువాత మరో ఆస్పత్రికి తీసుకువెళ్ళాలని వైద్యులు చెప్పడంతో మరో ప్రవేట్ ఆస్పత్రిక తీసుకువెళ్లేసరికే బాలిక మృతి చెందిందని అక్కడి వైద్యులు చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు మొదటి ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించామని తెలిపారు. నివేదిక వచ్చిన తరువాత తదుపరి చర్యలు ఉంటాయని ఆయన చెప్పారు.

అనుమతుల్లేని ఆలయ నిర్మాణంపై అభ్యంతరం

భీమవరం రూరల్, సెప్టెంబరు 16 : తమ ఇంటికి సమీపంలోనే గూట్లపాడులో చెరువు గట్టుపై అమ్మవారి ఆలయాన్ని అనుమతులు లేకుండా నిర్మించడంపై సుబ్రహ్మణ్యేశ్వరరావు, మణిరత్నమాల దంపతులు సోమవారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నామన్నారు. రెండు వారాల క్రితం గ్రామస్తులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్, డీపీవో విక్టర్‌కి ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి కలిసి సమస్య తెలిపామన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా దిగువ స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆలయ నిర్మాణంపై హైకోర్టులో పిటిషన్ చేశామని, కేసు విచారణలో ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణంపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గణపతి లడ్డూల వేలం


పెనుమంట్రలో లడ్డూని భక్తుడికి అందజేస్తున్న కమిటీ సభ్యులు

● నరసాపురం టౌన్ :పట్టణంలోని 26వ వార్డు వీవర్స్‌కాలనీలో వరసిద్ధి వినాయక స్వామి కమిటీ ఆధ్వర్యంలో 104 కేజీల భారీ లడ్డు వేలం నిర్వహించగా అంబడిపూడి బాల నాగేశ్వరరావు రూ 54,100 వేలకు దక్కించుకున్నారు. జి.కృష్ణ, నాగదుర్గాదేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● పాలకొల్లు రూరల్ : లంకలకోడేరులో 16 కిలోల లడ్డూ వేలం వేయగా గ్రామస్తుడు, ఎంతఃవో గంగాధరశర్మ రూ. 54 వేలకు దక్కించుకున్నారు. కోవా లడ్డును (మహిళలకు) చేకూరి వైష్ణవి రూ.20 వేలకు పాడుకున్నారు. అర్చకులు చంటి, శివబాబు, మురళీకృష్ణంరాజు, రామకృష్ణ, వెంకట పతిరాజు, శర్మ, సుబ్బరాజు, డి ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

● పెనుమంట్ర : గణపతి విగ్రహ దాత హైదరాబాద్ సత్య టెక్నాలజీస్ అధినేత కర్రి సుబ్బారెడ్డి స్వామి వద్ద ఉంచిన 15 కేజీల లడ్డూను పాలి గ్రామానికి చెందిన గణేశ్వర రెడ్డి, 10 కేజీల లడ్డూను పెనుమంట్ర గ్రామానికి చెందిన కర్రి కనికి రెడ్డి, 15 కేజీల లడ్డూను పత్తి శ్రీను, 10 కేజీల లడ్డూను మాంటిసోరి శేఖర్ రెడ్డి కుమారుడు విష్ణు రెడ్డి దక్కించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు రవీంద్ర రాజు, తుంపూడి విజయ్ కుమార్, తాడి వీర వెంకటరెడ్డి, జంపన శ్రీనివాసరాజు, అరటి గట్ల సత్యనారాయణ, నాగిరెడ్డి, చంటి, నరసింహారావు, సత్యనారాయణ, ఐటిఐ రాంబాబు, రాము, ఏ టు జెడ్ రెడ్డి గారు, భక్తులుపాల్గొన్నారు.


నరసాపురంలో నిర్వహించిన లడ్డూ వేలంలో పాల్గొన్న భక్తులు

విద్యా గణపతికి పూల అలంకారం



భీమవరం టౌన్, సెప్టెంబరు 16 : వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారంనాడు గునుపూడిలోని విద్యాగణపతికి పూలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ అర్చకులు ఉదయం పూజలు చేసి భక్తులు అందించిన పూలతో అలంకారం చేశారు. భక్తులు దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

టెన్నిస్ టోర్నమెంట్‌లో దార్విక్ ప్రతిభ



పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 16 : విజయవాడలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా అండర్-9 టెన్నిస్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన ఐదున్నర ఏళ్ళ బాలుడు దార్విక్ ద్వితీయ స్థానం సాధించాడని సోమవారం టౌన్ హాల్ కోచ్ కిరణ్, అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి ఎం ఆదినారాయణలె తెలిపారు. ధార్విక్‌ను పలువురు అభినందించారు.

రేపు జాబ్ మేళా

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 16 : స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం జాబ్ మేళ నిర్వహిస్తున్నట్టు కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహరావు, కార్యదర్శి కె.రామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. జాబ్‌మేళలో ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రజెంటేటివ్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్స్, కెమిస్ట్స్ అండ్ హెల్పర్స్, ఇండో ఎంఐఎం ఇంజి, డీఎస్‌సీ, హోండాయ్ మొబీస్ కంపెనీల్లో టెక్నీషిన్ల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వారు తెలిపారు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీఎస్సీ, బీటెక్, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ ఉత్తీర్ణులయి 30 ఏళ్ళలోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. అలాగే ఇతర సదుపాయాలు, భోజనం, వసతి, రవాణా ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయని వారు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలల వద్దకు అర్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు ఇతర వివరాలకు 98497 12739లో సంప్రదించవచ్చునని వారు తెలిపారు.